

విశాఖలోనే

తొలి సిపాయిల తిరుగుబాటు

1780 అక్టోబరు 3న ముగ్గురు బ్రిటీష్ సైనికులను కాల్చిచంపిన భారతీయ సిపాయిలు

- అనంతరం హైదరాలీకి మద్దతుగా మైసూరు బయలుదేరిన వారిని పట్టుకుని విశాఖపట్నం తీసుకువచ్చి ఉరి తీసిన బ్రిటీషర్లు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఈస్టిండియా కంపెనీపై 1857లో సిపాయిల తిరుగుబాటు జరిగింది. అదే స్వాతంత్ర్య పోరాటానికి నాంది అని...చరిత్రకారులు పేర్కొంటుంటారు. కానీ, దానికంటే ముందు మూడు పర్యాయాలు సిపాయిలు తిరుగుబాటు చేసినట్టు బ్రిటీష్ పాలకులు అంగీకరించడంతోపాటు వారి గజిట్‌లో ప్రస్తావించారు. వీటిలో మొదటి సిపాయిల తిరుగుబాటు 1780 అక్టోబరు మూడో తేదీన విశాఖ (ప్రస్తుతం క్వీన్ మేరీస్ పాఠశాలకు ఎదురుగా పాత రిజిస్ట్రార్ ఆఫీస్ పరిసరాలు) వద్ద జరిగింది. ఆ తరువాత 1806లో తమిళనాడులోని వెల్లూరు, 1824లో బారక్‌పూర్ (పశ్చిమ బెంగాల్)లో సిపాయిల తిరుగుబాట్లు జరిగాయి. విశాఖలో జరిగిన తొలి సిపాయిల తిరుగుబాటులో బ్రిటీష్ సైన్యంలో ముగ్గురిని చంపిన దేశీయ సైనికులను అప్పటి పాలకులు ఉరితీశారు (బ్రిటీష్ మిలట్రీ అధికారులు కాల్చారని కొన్నిచోట్ల ఉంది). 1780 సెప్టెంబరులో మైసూరు నవాబు హైదరాలీ, బ్రిటీష్ ఈస్టిండియా కంపెనీకి మధ్య యుద్ధం మొదలైంది. ఆ యుద్ధంలో హైదరాలీ దాదాపు పైచేయి సాధించే పరిస్థితులు కనిపించడంతో ఆంగ్లేయులు అప్రమత్తమయ్యారు. మద్రాస్ రాష్ట్రంలో ఉత్తరాన విశాఖపట్నం, మచిలీపట్నంలో సైనిక దళాలు ఉండేవి. రెండుచోట్ల నుంచి దళాలను మైసూరు యుద్ధంలో పాల్గొనేలా ఆదేశాలు వచ్చాయి. మచిలీపట్నం రేవు నుంచి కొంత సైన్యం బయలుదేరింది. విశాఖలో గేండియర్స్ రెజిమెంట్ నుంచి సైన్యాన్ని ఓడలో మద్రాస్‌కు, అక్కడ నుంచి మైసూరుకు తీసుకువెళ్లాలని నిర్ణయించారు. అయితే 1780 అక్టోబరు మూడో తేదీన మధ్యాహ్నం మూడు గంటల సమయంలో సైనికులు ఓడ ఎక్కడానికి తిరస్కరించారు. ఈ దశలో బ్రిటీష్ సైనికాధికారులు ఒత్తిడి తీసుకురావడంతో మహ్మద్ షేర్‌ఖాన్ నేతృత్వంలో కొందరు భారతీయ సిపాయిలు తిరగబడి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో బ్రిటీష్ సైన్యానికి చెందిన లెఫ్టినెంట్ క్రిప్స్, సైనికులు కింగ్స్ ఫోర్డ్ వెన్నర్, రూథర్‌ఫర్డ్ అనేవారు చనిపోయారు. కెప్టెన్ మేక్స్‌టన్, కెప్టెన్ లాన్‌లు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సందర్భంగా భారతీయ సైనికులు ఏకమై బ్రిటీష్ సైన్యానికి చెందిన ముఖ్య అధికారిని బందీ చేసి అక్కడ ఖజానా లూటీ చేసి రూ.21,999తోపాటు ఆయుధాలు తీసుకుని హైదరాలీకి మద్దతుగా యుద్ధంలో పాల్గొనేందుకు బయలుదేరారు. అయితే స్థానిక జమీందారుల సాయంతో మహ్మద్‌ఖాన్ మరికొంతమంది సైనికులను బ్రిటీష్ అధికారులు పాయకరావుపేట సమీపంలో పట్టుకుని విశాఖపట్నం తీసుకువచ్చారు. తొలుత కోర్టు మార్షల్ నిర్వహించి అతిక్రూరంగా హింసించి ఉరితీశారు.

ఎమ్మెల్సీగా బొత్స ఎన్నిక లాంఛనం

అధికారికంగా ప్రకటన రేపు

- నామినేషన్ ఉపసంహరించుకున్న స్వతంత్ర్య అభ్యర్థి
- రేపు సాయంత్రం 3 గంటల నుంచి కోడ్ ఎత్తివేత

విశాఖపట్నం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి):



ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఖాళీ అయిన ఎమ్మెల్సీ (స్థానిక సంస్థల కోటా) స్థానానికి వైసీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా బుధవారం రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ సమక్షంలో నామినేషన్లు పరిశీలించారు. నామినేషన్ల పరిశీలన కార్యక్రమానికి స్వతంత్ర్య అభ్యర్థి షేక్ షఫీ, వైసీపీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ తరఫున ఆయన ప్రతినిధులు హాజరయ్యారు. అన్ని పత్రాలు ఉండడంతో రెండు నామినేషన్లు సక్రమంగా ఉన్నట్టు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈనెల 16వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకు గడువు ఉంది. అయితే స్వతంత్ర్య అభ్యర్థి షేక్ షఫీ తాను నామినేషన్ ఉపసంహరించుకున్నట్టు బుధవారమే పత్రాలు దాఖలు చేశారు. దీంతో వైసీపీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ ఒక్కరే బరిలో ఉన్నట్టు అయ్యింది. అయినప్పటికీ ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈనెల 16వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల తరువాతే అధికారికంగా బొత్స సత్యనారాయణ ఎన్నికను ప్రకటిస్తారు. కాగా ఎన్నిక ఏకగ్రీవం కావడంతో ఈనెల 16వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల తరువాత కోడ్ తొలగిపోనున్నది. ఈ విషయాన్ని రిటర్నింగ్ అధికారి మయూర్ అశోక్ వెల్లడించారు. కాగా, ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండాలని కూటమి నిర్ణయించుకున్న సంగతి తెలిసిందే.

మహాత్ముడు నడయాడిన నేల



అనకాపల్లి గాంధీ మార్కెట్ వద్ద గాంధీజీ విగ్రహం

స్వాతంత్ర్యోద్యమ సమయంలో గాంధీజీతో పాటు ఎందరో ప్రముఖులు అనకాపల్లి సందర్శన

- విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమాన్ని ఇక్కడే స్వయంగా ప్రారంభించిన జాతిపిత
- ఆ మహనీయుని గుర్తుగా మార్కెట్‌కు పేరు
- దిమిలిలో ఉద్యమకారుల స్మారక స్తూపం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

స్వాతంత్ర్యోద్యమ సమయంలో పలుమార్లు మహాత్మాగాంధీ అనకాపల్లి పట్టణాన్ని సందర్శించారు. ఆయనతో పాటు అనేక మంది స్వాతంత్ర్య సమర యోధులు వచ్చారు. 1753లో ఫ్రెంచ్ దేశీయులపై దాడి జరిగిన నేపథ్యంలో స్వాతంత్ర్య సమర యోధుడు బస్సీదొరను కశింకోటలో అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో మహాత్మా గాంధీ అనకాపల్లి మార్కెట్‌లో విదేశీ వస్తువులను బహిష్కరించే ఉద్యమాన్ని స్వయంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక వర్తకులు, రైతుల అభ్యర్థన మేరకు అప్పట్లో అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గాంధీ మార్కెట్ అని పేరు పెట్టేందుకు గాంధీ అంగీకరించారు. కాగా ఎన్‌జీ రంగా, సీపీఐ నేత జయప్రకాష్ నారాయణ్, జవహర్‌లాల్ నెహ్రూ తదితరులు పలు మార్లు అనకాపల్లిలో జరిగిన



స్వాతంత్ర్య ఉద్యమాల్లో పాల్గొన్నారు. అనకాపల్లిలో 1944-45 కాలంలో కోరిబిల్లి జోగారావు, జక్కనహల్లి శ్రీరామమూర్తి స్వాతంత్ర్య ఉద్యమ పోరాటాల్లో పాల్గొన్నందుకు ఇక్కడే అరెస్టు చేసి వారిని తమిళనాడులో రాయవెల్లూరు జైలుకు తరలించారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో బ్రిటీష్ పాలకులు ఉద్యమకారులపై కేసులు పెట్టేవారు. అరెస్టు చేసి సుదూర ప్రాంతాలకు తరలించేవారు. అటువంటి సందర్భంలో స్వాతంత్ర్య పోరాట యోధులు అజ్ఞాతంలోకి వెళ్లిపోయేవారు. అనకాపల్లి పట్టణంలోని చాకవీధిలో ఓ ఉద్యమ కారుడి ఇంట్లో అనేక మంది స్వాతంత్ర్య పోరాట యోధులు తలదాచుకొని అజ్ఞాతంలో గడిపేవారు.

స్వాతంత్ర్య సమరయోధుల పుట్టినిల్లు దిమిలి

జిల్లాలో రాంబిల్లి మండలం దిమిలి గ్రామం స్వాతంత్ర్య సమరయోధులకు పుట్టినిల్లుగా భాసిల్లుతోంది. ఈ గ్రామానికి చెందిన సుమారు 20 మందికిపైగా స్వాతంత్ర్య పోరాటాల్లో పాల్గొన్నారు. క్విట్ ఇండియా ఉద్యమంలో ఈ గ్రామానికి చెందిన అనేక మంది పాల్గొన్నారు. దీనికి గుర్తుగా గ్రామంలో ప్రభుత్వ పాఠశాల వద్ద స్తూపాన్ని ఏర్పాటు చేశారు. దిమిలి గ్రామం నుంచి స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న వారిలో ప్రముఖంగా గ్రామానికి దివంగత ఎస్.రామదాసు, సేనాపతి అప్పలనాయుడు, కాలనాథ పట్టా జగన్నాథాచార్యులు, ఎల్లాయి అప్పల నర్సింహం, నేమాని సత్యనారాయణ, ఇంద్రగంటి కామేశ్వరరావు, శ్యామసుందరమ్మ పేర్లు వినిపిస్తుంటాయి. ప్రతి ఏడాది ఆగస్టు 15న దిమిలి గ్రామంలో వారి త్యాగాలకు గుర్తుగా స్తూపం వద్ద స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

పంద్రాగస్టుకు ఏర్పాట్లు పూర్తి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 14: స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో గురువారం నిర్వహించే స్వాతంత్ర దినోత్సవ కార్యక్రమానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం తొమ్మిది గంటలకు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత జాతీయ జెండాను ఆవిష్కరిస్తారని రెవెన్యూ వర్గాలు తెలిపాయి. కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ ఎం.దీపికలతో పాటు వివిధ జిల్లా విభాగాధిపతులు పాల్గొనే ఈ వేడుకలకు సభా వేదిక, వివిధ స్టాళ్ల కోసం ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని వివిధ విభాగాల్లో ఉత్తమ సేవలందించిన అధికారులకు హోం మంత్రి ప్రశంసాపత్రాలు అందించనున్నారు. అనకాపల్లి డీఎస్పీ ఎస్.అప్పలరాజు ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.


అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో సిద్ధమవుతున్న వేదిక

విప్లవ జ్యోతి అల్లూరి



తెల్లదొరల వెన్నులో వణుకు పుట్టించిన సీతారామరాజు

- స్వాతంత్ర్య ఉద్యమంలో రంప తిరుగుబాటు ఓ చరిత్ర
- రెండేళ్ల పాటు బ్రిటీష్ పాలకులకు కంటి మీద కునుకు కరువు
- ఆదివాసీలపై సైన్యం హింస భరించలేక మంపలో అల్లూరి లొంగుబాటు

చింతపల్లి, ఆగస్టు 14: స్వాతంత్ర్య ఉద్యమంలో మన్యం వేదికగా అల్లూరి సీతారామరాజు సాగించిన రంప తిరుగుబాటు తెల్లదొరల వెన్నులో వణుకు పుట్టించింది. రెండేళ్ల పోరాటంలో బ్రిటీష్ పాలకులకు అల్లూరి సీతారామరాజు కంటిమీద కునుకులేకుండా చేశారు. 1922 నుంచి 1924 వరకు అల్లూరి సీతారామరాజు చేపట్టిన ఉద్యమం స్వాతంత్ర్య పోరాటంలో ఓ చరిత్ర సృష్టించింది.

బ్రిటీష్ పాలకుల అకృత్యాలు, దురాగతాలను జీర్ణించుకోలేని సీతారామరాజు ఆదివాసీలకు అండగా పోరాటం చేయాలని నిర్ణయించుకున్నాడు. ఆదివాసీల హక్కులను వివరిస్తూ వారిలో ధైర్యాన్ని పెంపొందించాడు. అల్లూరి అనుచరుల్లో గాము గంటందొర, గాము మల్లుదొర, కంకిపాటి ఎండుపడాల్, గోకిరి ఎర్రేసు ముఖ్యులు. సాయుధ పోరాటానికి సన్నద్ధమైన సీతారామరాజు ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు సాయుధ పోరాటం సరైన మార్గమని నిర్ణయించుకుని 1922 ఆగస్టు 17న చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై దాడికి సిద్ధమయ్యారు.

పోలీస్ స్టేషన్లపై వరుస దాడులు

సాయుధ పోరాటానికి శ్రీకారం చుట్టిన అల్లూరి సీతారామరాజు వరుసగా పోలీస్ స్టేషన్లపై దాడి చేశారు. 1922 ఆగస్టు 22వ తేదీన గంటందొర, మల్లుదొర, ఎండుపడాల్, ఎర్రేసుతో పాటు 300 మంది గిరిజన విప్లవకారులతో కలిసి చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై దాడి చేశారు. ఆయుధాలను స్వాధీనం చేసుకుని ఆ వివరాలను స్టేషన్ డైరీలో రాసి ఇంగ్లీష్‌లో సంతకం చేశారు. అలాగే పెదవలస, రంపుల ఘాట్ మీదుగా అడ్డదారిలో వెళ్లి మరుసటి రోజు కృష్ణాదేవిపేట పోలీస్ స్టేషన్‌పై దాడి చేశారు. ఈ రెండు సంఘటనలు విజయవంతం కావడంతో పోలీస్ స్టేషన్‌లపై దాడుల పరంపరను కొనసాగించారు. 24వ తేదీన రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్‌పై దాడి చేశారు. వరుసగా మూడు రోజుల పాటు మూడు స్టేషన్లపై అల్లూరి, అతని సేన దాడులు చేయడంతో బ్రిటీష్ అధికారుల్లో వణుకుపుట్టింది.


కృష్ణాదేవిపేటలో అల్లూరి సమాధి

ఉద్యమం అణచివేతకు రూథర్‌ఫర్డ్ నియామకం

సీతారామరాజు ఉద్యమాన్ని అణచివేసేందుకు 1924 ఏప్రిల్ 17న మన్యానికి కలెక్టర్‌గా రూథర్‌ఫర్డ్‌ను నియమించారు. ఆయన కృష్ణాదేవిపేటలో సభను ఏర్పాటుచేసి వారం రోజుల్లో విప్లవకారుల ఆచూకీ తెలియకపోతే ప్రజలను కాల్చివేస్తామని హెచ్చరించాడు. అప్పటికే ఆదివాసీలను బ్రిటీష్ సైన్యం రామరాజు ఆచూకీ తెలపాలని చిత్రహింసకు గురిచేసింది. కృష్ణాదేవిపేట సభ విషయాలను మంప మునసబు ద్వారా తెలుసుకున్న సీతారామరాజు మే 7న తాను ఉన్న ప్రాంతాన్ని పశువులకాపరి ద్వారా పోలీసులకు చేరవేసి మంప చెరువులో స్నానంచేస్తూ పట్టుబడ్డాడు. ఎటువంటి విచారణ లేకుండా అల్లూరి సీతారామరాజును కొయ్యూరులోని చింతచెట్టుకు కట్టి మేజర్ గుడాల్ కాల్చిచంపాడు. 8వ తేదీన రాజు మృతదేహాన్ని ఫొటో తీయించి కృష్ణాదేవిపేటలో దహనం చేశారు.

ఉత్సాహంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియం వద్ద బుధవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీని కలెక్టర్ విజయకృష్ణన్ ప్రారంభించారు. స్టేడియం వద్ద ప్రారంభమైన ర్యాలీ నెహ్రూచౌక్ వద్దకు చేరుకుంది. అక్కడ అధికారులు, విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఈ ర్యాలీ తిరిగి ఎన్టీఆర్ స్టేడియానికి చేరుకుంది.

- వార్త 9వ పేజీలో..



ఎన్టీఆర్ స్టేడియం వద్ద ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్


నెహ్రూచౌక్‌లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాలు


గబ్బాడ డిపోలో ఇసుక నిల్వలు

పర్యావరణ అనుమతులు రాకుండానే ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ నిర్వాకం

- షోకాజ్ నోటీసు ఇచ్చిన మైనింగ్ అధికారులు
- 15 రోజుల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశం

నర్సీపట్నం, ఆగస్టు 14:

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ పర్యావరణ అనుమతులు రాకుండానే రాజమహేంద్రవరంలో విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు జరిపినట్టు తెలిసింది. ఈ ఇసుకను నర్సీపట్నం మండలం గబ్బాడ డిపోలో నిల్వ చేసినట్టు సమాచారం. దీనిపై జిల్లా మైనింగ్ అధికారులు ఆ సంస్థకు ఈ నెల 8న షోకాజ్ నోటీసు జారీ చేశారు. పర్యావరణ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరిపినందున ఎందుకు చర్యలు తీసుకోకూడదో 15 రోజుల్లో సమాధానం ఇవ్వాలని ఆ నోటీసులో పేర్కొన్నారు.

గత వైసీపీ ప్రభుత్వం నూతన ఇసుక విధానంలో భాగంగా 2019 సెప్టెంబరులో జీవో ఎంఎస్ నంబరు 71 తీసుకొచ్చి ఏపీఎండీసీ ద్వారా ఇసుక సరఫరాకి నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. 2020 నవంబరులో జయప్రకాశ్ పవర్ వెంచర్స్ ప్రైవేటు లిమిటెడ్ అనే ప్రైవేటు సంస్థకు ఇసుక కాంట్రాక్ట్‌ను అప్పగించింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాలో ప్యాకేజ్-1 కింద ప్రభుత్వం నిర్దేశించిన ధరకు ఇసుక సరఫరా చేయడానికి అనుమతి ఇచ్చింది. దీంతో ఏపీఎండీసీ దగ్గర ఉన్న ఇసుక నిల్వలు జయప్రకాశ్ సంస్థకు అప్పగించింది. సార్వత్రిక ఎన్నికలకు సరిగ్గా ఐదు నెలల ముందు 2023 డిసెంబరులో వైసీపీ ప్రభుత్వం ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థకు రెండేళ్ల కాల పరిమితికి ఇసుక కాంట్రాక్ట్ ఇచ్చింది. పర్యావరణ అనుమతులు రాకుండానే ప్రతిమ ఇన్‌ఫ్రా సంస్థ రాజమహేంద్రవరం గాయత్రి-10 రీచ్‌లో విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు జరిపి డిపోలకు తరలించడం వివాదాస్పదంగా మారింది.

స్పీకర్ ఆదేశాలతో అధికారుల్లో కదలిక

నర్సీపట్నం మండలం గబ్బాడ డిపోలో ఇసుక నిల్వలపై రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆరోపణలు చేసిన నేపథ్యంలో మైనింగ్ అధికారులలో కదలిక వచ్చింది. 63 వేల టన్నుల ఇసుక అక్రమంగా తరలించి గబ్బాడ డిపోలో నిల్వ చేసింది ఎవరో తేల్చాలని జిల్లా మైనింగ్ అధికారులను స్పీకర్ ఆదేశించారు. జిల్లా మైనింగ్ అధికారులు రాజమహేంద్రవరం మైనింగ్ శాఖకు లేఖ రాసి వివరాలు సేకరించారు. ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ పర్యావరణ అనుమతులు లేకుండా తవ్వకాలు జరిపినట్టు తెలుసుకొని ఈ నెల 8న షోకాజ్ నోటీసు జారీ చేశారు. 15 రోజుల్లో షోకాజ్ నోటీసుకి సమాధానం రాని పక్షంలో తదుపరి చర్యలు తీసుకుంటామని జిల్లా మైనింగ్ అధికారి తెలిపారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ వ్యాపారం

- టైరు బండి రూ.1,600
- ట్రాక్టర్ రూ.8,500
- గగ్గోలు పెడుతున్న వినియోగదారులు



నర్సీపట్నం, ఆగస్టు 14: ఇసుక కొరత ప్రభావం అక్రమ వ్యాపారులకు వరంగా మారింది. గబ్బాడ డిపోలో ఇసుక అందుబాటులోకి రాకపోవడంతో ఇసుక అక్రమ వ్యాపారులు ఇష్టానుసారం ధరలు పెంచేసి విక్రయిస్తున్నారు. బలిఘట్టం వరహానదిలోని ఇసుక టైర్ బండితో తీసుకు వచ్చి రూ.1600 లకు విక్రయిస్తున్నారు. గృహ నిర్మాణదారుడుకి అత్యవసరం అయితే ధర మరో వంద రూపాయలు పెంచి విక్రయిస్తున్నారు. ట్రాక్టర్ ఇసుక రూ.8,500 లకు విక్రయిస్తున్నారు. రెండు నెలలుగా గబ్బాడ డిపోలో ఇసుక అందుబాటులోకి రాకపోవడంతో ఇసుక వ్యాపారుల ఇష్టారాజ్యం అయిపోతుంది. రూ.6వేలు లోపు ఉండే ఇసుక ధర ఇప్పుడు ఏకంగా రూ.8,500లకు విక్రయిస్తున్నారు. రాజమహేంద్రవరం నుంచి టిప్పర్లు, లారీలలో తీసుకువచ్చి ఇసుక నిల్వలు పెట్టి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. నిబంధనల ప్రకారం రాజమహేంద్రవరం నుంచి తీసుకు వచ్చిన ఇసుక సొంత అవసరాలకు మాత్రమే వాడుకోవాలి తప్పితే విక్రయించకూడదు. కాగా ఇసుక ధరలు అందుబాటులోకి తీసుకు రావాలని గృహనిర్మాణదారులు కోరుతున్నారు.

బియ్యపు గింజపై జాతీయ జెండా


బియ్యపు గింజపై జాతీయ జెండా

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మాడుగులకు చెందిన మైక్రో ఆర్టిస్ట్ గోపాల్ బియ్యపు గింజపై జాతీయ జెండాను తీర్చిదిద్దాడు. ఇది అందర్నీ ఆకట్టుకుంది. గతంలో చాక్‌పీస్, పెన్సిల్ ముల్లుపై ఎన్నో అద్భుత కళాఖండాలను సృష్టించి అందరి మన్ననలు పొందాడు.

- మాడుగుల


గోపాల్

పీఏసీఎస్‌లో అవకతవకలపై విచారణ


రికార్డులు పరిశీలిస్తున్న దృశ్యం

నర్సీపట్నం, ఆగస్టు 14: రోలుగుంట మండలం జానకిరామపురం పీఏసీఎస్‌లో జరిగిన అవకతవకలపై విచారణ జరిగింది. బుధవారం విచారణ అధికారి ఐవీ రమణమూర్తి.. డీసీసీబీ నర్సీపట్నం బ్రాంచ్ మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్, జానకిరామపురం సీఈవోను వేర్వేరుగా విచారించారు. నర్సీపట్నం బ్రాంచ్ మేనేజర్ నుంచి ఆధారాలు సేకరించారు. పీఏసీఎస్ సీఈవో మీద వచ్చిన అభియోగాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం డీసీసీబీ ప్రధాన కార్యాలయం ఏజీఎం ఎం.శ్రీనివాసరావు, చీఫ్ మేనేజర్ ఎంవీవీ కిశోర్ పాల్గొన్నారు.

జాతీయ స్ఫూర్తి నింపిన జెండా

వాడవాడలా ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ ▸ ఉత్సాహంగా పాల్గొన్న చిన్నలు, పెద్దలు



పాయకరావుపేట, ఎలమంచిలిలలో జెండాలతో ర్యాలీలు నిర్వహిస్తున్న అధికారులు, నాయకులు

పాయకరావుపేట, ఆగస్టు 14 : పట్టణంలో కూటమి నాయకులు బుధవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, బీజేపీ నాయకులు పాకలపాటి రవిరాజు, జనసేన పట్టణ అధ్యక్షుడు అచంట దొర, కూటమి నాయకులు పల్లా విలియంకేరి, మలిపెద్ది వెంకటరమణ, చింతకాయల రాంబాబు, పెదిరెడ్డి పండు, వేములపూడి అప్పారావు, ఎం.దుర్గాప్రసాద్, వెంకటరమణ, కువల కుమార్, బీఎస్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలి: ప్రతి ఒక్కరిలో జాతీయ స్ఫూర్తిని నింపేలా పట్టణంలోని ప్రధాన రహదారిపై హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జ్ కమిషనర్ ప్రభాకరరావు, మెప్మా ప్రతినిధి పద్మ, టీపీవో శ్రీలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, ఆర్‌వో నీలిమ, సీఆర్పీ, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : మండలంలోని పలు గ్రామాల్లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ర్యాలీలు నిర్వహించారు. గుడివాడలో జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు హెచ్‌ఎం ఎం. నాగన్నదొర ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. వ్యాయామ ఉపాధ్యాయుడు కందూరు రాజు ఆధ్వర్యంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆ నంబరు ఆకారంలో విద్యార్థులు ఏర్పడి ఆకట్టుకున్నారు. ఎస్.రాయవరంలో బాలికల పాఠశాల విద్యార్థినులు జాతీ పతాకాలతో చేపట్టిన ర్యాలీలో సర్పంచ్ భూపతి అప్పారావు, కార్యదర్శి ఏవీఎస్ సత్యనారాయణ, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

తుమ్మపాల : ఇక్కడి ప్రధాన తపాలా కార్యాలయంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలను బుధవారం ముందస్తుగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వాతంత్ర్య సమరభేరిలో విధ్వంసకర పరిణామాలకు సంబంధించిన ఛాయ చిత్రాలను ప్రదర్శనలో ఉంచి తపాలాశాఖ సిబ్బంది విద్యార్థులు, ఖాతాదారులకు వివరించారు. తపాలాశాఖ అనకాపల్లి డివిజన్ ఏఎస్పీ సంజయ్‌కుమార్ పాండా, తపాలా శాఖ సిబ్బంది వెంకటేశ్వరరావు, శంకరరావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : మండల కేంద్రం పరవాడలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జెండాలతో ర్యాలీ జరిపారు. ప్రధానోపాధ్యాయుడు బి. అప్పలనాయుడు, ఉపాధ్యాయులు కార్యదర్శి అచ్యుతరావు, సచివాలయ ఉద్యోగులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు



ఎస్.రాయవరం : స్వాతంత్ర్యం సిద్ధించి 78 సంవత్సరాలు అయిన సందర్భంగా ఆ ఆకారంలో గుడివాడ విద్యార్థులు



పరవాడలో...

నక్కపల్లిలో సీపీఎం కాగడాల ప్రదర్శన

నక్కపల్లి : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బుధవారం రాత్రి నక్కపల్లిలో సీపీఎం ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన చేపట్టారు. ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ నేటికీ స్వతంత్ర్య ఫలాలు అందరికీ దక్కలేదని, రోజురోజుకూ పేదరికం, నిరుద్యోగం పెరుగుతోందని వాపోయారు. మండల కన్వీనర్ ఎం.రాజేష్‌తోపాటు నాయకులు బి.రాము, ఎం.మహేష్‌బాబు, కె.ప్రసాద్, వై.నవీన్, సీహెచ్.సోమేశ్, ఎం.శ్రీనివాస్, కె.బుజ్జి, ఎం.భైరాగిరాజు తదితరులు పాల్గొన్నారు.

22న కోట్నివీధిలో మరిడిమాంబ ఉత్సవం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల తదితరులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 14 : కోట్నివీధిలో ఈనెల 22న మరిడిమాంబ ఉత్సవం జరగనుంది. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని బుధవారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆవిష్కరించారు. 84వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి మాదంశెట్టి నీలబాబు, లక్ష్మీప్రసాద్, కోట్ని రామకృష్ణ, ఆలయ చైర్మన్ కోట్ని పూర్ణచంద్రరావు, ధర్మకర్తలు శ్రీనివాసరావు, మధు, సంతోష్, రమణమ్మ, జయశంకర్, అయ్యన్నదొర పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్విజ్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

సబ్బవరం, ఆగస్టు 14 : అంబేడ్కర్ చైర్, ఆంధ్రా యూనివర్సిటీ సంయుక్తంగా బుధవారం నిర్వహించిన నేషనల్ ఫ్రీడమ్ జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో స్థానిక డాక్టర్ అంబేడ్కర్ గురుకుల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. కె.మోహన్‌లాల్, ఉదయ్‌కుమార్, నందకిశోర్, సందీప్‌లకు ఆర్టీఏ చీఫ్ కమిషన్ శామ్యూల్ జోనతన్, అంబేడ్కర్ చైర్‌ప్రొఫెసర్ స్టీఫెన్ జేమ్స్ తదితరులు మెమొంటోలను అందజేసినట్టు సత్కరించినట్టు విద్యాలయం ప్రిన్సిపాల్ ఎన్.రామకృష్ణ తెలిపారు.

62 మద్యం సీసాలు స్వాధీనం

మునగపాక (తుమ్మపాల), ఆగస్టు 14 : మునగపాక మండలంలో బుధవారం పోలీస్ సిబ్బంది దాడులు నిర్వహించారు. బెల్టుషాపులు నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసులను నమోదు చేసి, 62 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు.

వీఆర్‌ఏల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే రమేష్‌బాబుకు సమస్యలు వివరిస్తున్న వీఆర్‌ఏలు

సబ్బవరం, ఆగస్టు14: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం మండలంలోని వీఆర్‌ఏలు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబుకు వినతి పత్రం అందజేశారు. జిల్లా కార్యదర్శి నీటిపల్లి గంగాధర్ ఆధ్వర్యంలో అంతా కలిసి సమస్యలను విన్నవించారు.

కూండ్రంలో ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

కొత్తూరు, ఆగస్టు 14 : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కూండ్రంలో బుధవారం యువకులు క్రికెట్ పోటీలను నిర్వహించారు. సాయంత్రం విజేతలను సర్పంచ్ నందారపు లక్ష్మి, టీడీపీ సీనియర్ నాయకుడు నందారపు సూరిబాబు అభినందించారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు వాయిదా వేయాలి

తుమ్మపాల, ఆగస్టు 14 : స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను వాయిదా వేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రతినిధులు కోరారు. ఈ మేరకు బుధవారం డీఈవో వెంకటలక్ష్మమ్మను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జీఎస్ ప్రకాష్ మాట్లాడుతూ ఈనెల 17న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికల కారణంగా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు, వర్కు అడ్జిస్టమెంట్ వాయిదా వేయాలన్నారు.

'యోకోహామా' ఇంటర్వ్యూల్లో 52 మంది ఎంపిక



ఇంటర్వ్యూలకు హాజరైన వారికి సంస్థ ప్రతినిధి సూచనలు

అచ్యుతాపురం, ఆగస్టు 14 : ఇక్కడి ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో బుధవారం యోకోహామా సంస్థ ఇంటర్వ్యూలు నిర్వహించింది. డిగ్రీ, ఐటీఐ, డిప్లమో ఉత్తీర్ణులైన 86 మంది హాజరుకాగా, 52 మందిని ఎంపిక చేశామని సంస్థ ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మధు తెలిపారు. కర్మాగారం ప్రతినిధులు శ్రవణకుమార్, బాలాజీ, ప్రశాంతి విద్యాసంస్థల చైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం... crime news

లంకెలపాలెంలో తప్పిన ప్రమాదం

» ట్యాంకర్‌ను ఢీకొన్న ట్రాలర్ లారీ



ప్రమాదంలో దెబ్బ తిన్న లారీని క్రేన్ సాయంతో తొలగిస్తున్న దృశ్యం

లంకెలపాలెం, ఆగస్టు 14 : జాతీయ రహదారి లంకెలపాలెం ప్రధాన కూడలిలో బుధవారం సాయంత్రం పెను ప్రమాదం తప్పింది. ఆగి ఉన్న ట్యాంకర్ లారీని ట్రాలర్ లారీ వేగంగా వచ్చి ఢీకొంది.ఈ ఘటనలో ట్రాలర్ లారీ క్యాబిన్ నుజ్జయ్యింది. సుమారు గంటకు పైగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి. విశాఖ నుంచి అనకాపల్లి వెపునకు వెళుతున్న ట్యాంకర్ లారీ సరిగ్గా లంకెలపాలెం కూడలికి వచ్చేసరికి ట్రాఫిక్ సిగ్నల్ పడింది. అదే సమయంలో ఐరన్ బుల్లెట్లతో వెనుక వస్తున్న ట్రాలర్ లారీ వేగం రావడంతో అదుపు తప్పి సిగ్నల్స్ వద్ద ఆగి ఉన్న ట్యాంకర్ లారీని బలంగా ఢీకొంది. దీంతో ట్రాలర్ లారీ క్యాబిన్ పూర్తి దెబ్బంది. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. అయితే ట్యాంకర్ ముందు ఎలాంటి వాహనాలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ కారణంగా సుమారు గంటకు పైగా వాహనాలు నిలిచిపోవడంతో అంతా తీవ్రఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలీసులు క్రేన్ సాయంతో వాహనాలను అక్కడి నుంచి తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

నాలుగు తులాల బంగారం చోరీపై ఫిర్యాదు

రాంబిల్లి, ఆగస్టు 14 : మండలంలోని ఓ గ్రామంలో నాలుగు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్టు బుధవారం ఫిర్యాదు అందిందని రాంబిల్లి సీఐ నరసింగరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. పంచదార్ల గ్రామానికి చెందిన గుర్రం అరుణ కుమారి ఇటీవల తన పుట్టింటికి వెళ్లింది. రెండు రోజుల క్రితం తిరిగి వచ్చి చూసేసరికి తన ఇంట్లోని బీరువాలో ఉంచిన నాలుగు తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో తమకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న సీఐ తెలిపారు.

నిన్న జనసేనలో.. నేడు మళ్లీ వైసీపీలో..!

» వైస్ ఎంపీపీ ఉమా దంపతుల రాజకీయంపై చర్చ



తాడేపల్లిలో జగన్‌తో వైస్ ఎంపీపీ ఉమా, గణేశ్ కలిసి ఉన్న చిత్రం

ఎలమంచిలి, ఆగస్టు 14 : ఎలమంచిలి వైస్ ఎంపీపీ శిలపరశెట్టి ఉమా, గణేశ్ దంపతులు తాజాగా మళ్లీ వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని కలిసినట్టు ఫొటో బయటకు రావడంతో మండల వాసులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీకి చెందిన వీరు ఈ నెల తొమ్మిదో తేదీన మంగళగిరిలో ఎలమంచిలి ఎమ్మెల్యే సమక్షంలో జనసేనలో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి సుందరపు విజయకుమార్ సాదరంగా ఆహ్వానించారు. కానీ ఆరు రోజులు గడవకముందే బుధవారం తాడేపల్లిలో వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఎలమంచిలి నియోజకవర్గ నేతలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కన్నబాబుతో పాటు ఉమా, గణేశ్ దంపతులు ఇద్దరూ జగన్‌ను కలిసి ఉన్న ఫొటో వైరల్ అవుతోంది. ఇది చూసిన స్థానికులు నివ్వెరపోతున్నారు.

హస్తినలో వేడుకలకు అంగన్‌వాడీ కార్యకర్త రమణమ్మ



సబ్బవరం, ఆగస్టు 14 : ఢిల్లీలో గురువారం జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడకల్లో పాల్గొనేందుకు మహిళా శిశు సంక్షేమ శాఖ తరపున మండలంలోని మలునాయుడు పాలెం-3 అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త రావిపల్లి రమణమ్మ ఎంపికైనట్టు సీడీపీవో లలితకుమారి తెలిపారు. ప్రధాని మోదీ చేతులమీదుగా రమణమ్మ జ్ఞాపికను అందుకోనున్నారని ఆమె వివరించారు.

గిరిజన గ్రామం మన్యంపాలెంలో వైద్య శిబిరం



ఆరోగ్య సూత్రాలను వివరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి విజయ

ఎలమంచిలి, ఆగస్టు 14 : మండలంలోని ఏకైక గిరిజన గ్రామం మన్యంపాలెంలో బుధవారం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అనంతరం చట్టాలపై అక్కడివారికి అవగాహన కల్పించారు. వైద్య బృందం పలువురికి పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులతో పాటు వైద్య, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, ఆగస్టు 14: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా వయా దువ్వాడ మీదుగా వివిధ ప్రాంతాలకు ఒకవైపు ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. మధురై - ముజాఫర్‌పూర్; 06114 నంబరు గల రైలు ఈనెల 18న (ఆదివారం) రాత్రి 7.05 గంటలకు మధురైలో బయలుదేరి మర్నాడు రాత్రి 9.40కు దువ్వాడ, బుధవారం తెల్లవారుజాము 2.45 గంటలకు ముజాఫర్‌పూర్ చే రుతుంది. కొచువెలి-పాట్నా రైలు ఈనెల 18న (ఆదివారం) రాత్రి 7.00 గంటలకు కొచువెలిలో బయలుదేరి మర్నాడు రాత్రి 11.05 గంటలకు దువ్వాడ, బుధవారం ఉదయం 5.45 గంటలకు పాట్నా చేరుతుంది. తిరునెల్వేలి-పాట్నా రైలు ఈ నెల 17న (శనివారం) రాత్రి 9.45 గంటలకు తిరునెల్వేలిలో బయలుదేరి మర్నాడు రాత్రి 11.05 గంటలకు దువ్వాడ, మంగళవారం ఉదయం 5.45 గంటలకు పాట్నా చేరుతుంది. చెన్నై సెంట్రల్-పాట్నా 06003 నంబరు గల రైలు ఈనెల 16న (శుక్రవారం) ఉదయం 10.45 గంటలకు చెన్నైలో బయలుదేరి రాత్రి 11.05 గంటలకు దు వ్వాడ, ఆదివారం ఉదయం 5.45 గంటలకు పాట్నా చేరుతుంది.

ప్రత్యేక రైళ్లకు ఎలమంచిలిలో హాల్ట్

ప్రయాణికుల డిమాండ్ మేరకు విశాఖ, తిరుపతి, బెంగళూరు మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్లకు ఎలమంచిలి స్టేషన్‌లో అదనపు హాల్ట్ కల్పించినట్టు తెలిపారు. ఎలమంచిలిలో హాల్ట్ కల్పించిన వాటిలో విశాఖ-తిరుపతి ప్రత్యేక రైలు (08583), తిరుపతి-విశాఖ ప్రత్యేక రైలు (08584), విశాఖ-ఎస్ఎంవీ బెంగళూరు ప్రత్యేక రైలు (08543), ఎస్ఎంవీ బెంగళూరు-విశాఖ ప్రత్యేక రైలు (08544) ఉన్నాయని పేర్కొన్నారు.

గరీబ్‌రథ్‌కు తాత్కాలిక అదనపు కోచ్‌లు

విశాఖ, సికింద్రాబాద్ మధ్య రాకపోకలు సాగిస్తున్న గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌కు అదనంగా రెండు థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌లు జత చేశారు. సికింద్రాబాద్ నుంచి విశాఖ 12740 నంబరు గల ఈ రైలు ఈనెల 14 (బుధవారం) నుంచి 19వ తేదీ వరకు, విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే 12739 నంబరు గల రైలుకు ఈనెల 15 నుంచి 20వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	78.00
లైవ్ ధర	98.00
విత్ స్కిన్	166.00
స్కిన్ లెస్	176.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	490
విజయనగరం	494
శ్రీకాకుళం	494

మహనీయుల స్ఫూర్తితో ముందడుగు

» జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పిలుపు

» అధికారులు, విద్యార్థులతో కలిసి భారీగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీ



జెండా చేతబట్టి ముందుకు సాగుతున్న కలెక్టర్ విజయకృష్ణన్ తదితరులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 14: మహనీయుల బాటలో పయనిస్తూ భావితరాలకు స్ఫూర్తిగా నిలుద్దామని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. హర్‌ఘర్ తిరంగా ర్యాలీని బుధవారం ఎన్టీఆర్ స్టేడియం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్య సాధన కోసం ఎన్నో త్యాగాలు చేసిన మహనీయుల సేవలను స్మరించుకుంటూ వారి బాటలో పయనిద్దామన్నారు. వారి త్యాగాలను, సాహసాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. దేశ ప్రయోజనాలు, సమాజ హితం కోసం అంతా అంకిత భావంతో పనిచేయాలన్నారు. అనంతరం స్టేడియం నుంచి ప్రారంభమైన ర్యాలీ నెహ్రూచౌక్ మీదుగా వివిధ ప్రాంతాల గుండా సాగి తిరిగి స్టేడియానికి చేరుకుంది. అధికారులు, విద్యార్థులు, పట్టణవాసులు నెహ్రూచౌక్‌లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ ర్యాలీలో అడిషినల్ ఎస్పీ బి.విజయభాస్కర్, డీఈవో వెంకటలక్ష్మమ్మ, ఆర్డీవో చిన్నికృష్ణ, డీఎఫ్‌వో లక్ష్మణరావు, డీఎస్‌డబ్ల్యూఎస్ అధికారిణి మంజులావాణి, అనకాపల్లి డీఎస్పీ అప్పలరాజు, సీఐలు శంకరరావు, పైడపునాయుడు, వినోద్ బాబు, వివిధ విభాగాధిపతులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, భారీ ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతో హక్కుల్ని కాపాడుకుందాం

» సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింగరావు

కొత్తూరు, ఆగస్టు 14 : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సీఐటీయూ ఆధ్వర్యంలో అనకాపల్లి చిల్డ్రన్స్ క్లబ్ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ నాడు కులమతాలకు అతీతంగా ప్రజలందరూ బ్రిటీష్ వారిని దేశం నుంచి వెళ్లగొట్టారని, నేడు అదే స్ఫూర్తితో మన హక్కుల్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం అంగన్‌వాడీ, ఆశ, మున్సిపల్ కార్మికుల పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శంకరరావు, కోటేశ్వరరావు, కార్యదర్శులు గోనేరు వరలక్ష్మి, ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.డి.వరలక్ష్మి, రైతు సంఘం నాయకులు నాయుడు బాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ, వెంకటేష్, అప్పారావు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పెన్సిల్ ముల్లుపై జాతీయ జెండా



పెన్సిల్ ముల్లుపై చెక్కిన జాతీయ జెండా, పక్కన సంజయ్‌దీపక్ (ఇన్‌సెట్)

పాయకరావుపేట, ఆగస్టు 14 : పట్టణానికి చెందిన సూక్ష్మ కళాకారుడు మరో అద్భుత కళాఖండాన్ని సృష్టించాడు. ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న కుందూరు సంజయ్‌దీపక్ తన కళానైపుణ్యంతో పెన్సిల్ ముల్లుతో ఎన్నో అద్భుతాలు సృష్టించాడు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బుధవారం పెన్సిల్ ముల్లుపై సెంటీమీటరు సైజులో జాతీయ జెండాను తయారుచేసి పలువురి దృష్టిని ఆకర్షించాడు.

కోటవురట్ల మండలంలో కుండపోత



వర్షం నీటితో నిండిన ప్రధాన రహదారి

కోటవురట్ల, ఆగస్టు 14 : వాతావరణంలో మార్పుల కారణంగా బుధవారం మండలంలో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ మండినప్పటికీ మధ్యాహ్నం మూడు గంటలప్రాంతంలో ఆకాశం మేఘావృతమైంది. అనంతరం సుమారు గంటన్నర పాటు కుండపోత వర్షం పడింది. దీంతో గెడ్డలు, వాగులు పొంగి ప్రవహించాయి.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

» కశింకోట మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ లక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కలగ లక్ష్మి

కశింకోట, ఆగస్టు 14 : గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీపీ కలగ లక్ష్మి అన్నారు. బుధవారం ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండడం వల్ల ఎటువంటి తీర్మానాలు చేయలేమన్నారు. గ్రామాల్లో డయేరియా, డెంగ్యూ లతో పాటు అంటువ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. భూ సర్వే చేసినప్పుడు జగన్ ఫొటో ఉండకుండా ఉండాలన్నారు. వాటిపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే ఆ రాళ్లను తొలగిస్తామ డిప్యూటీ తహసీల్దార్ సురేష్ నాయుడు వివరించారు. మండలంలో నీటి సమస్య పరిష్కారానికి ఇంటింటి కుళాయి పథకం కింద ఎనిమిది ట్యాంకులు నిర్మించాలని గతంలో తీర్మానం చేశామన్నారు. నిధులు మంజూరైన వెంటనే ఈ ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శేషుబాబు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

» ప్రారంభించిన ఎంపీ సీఎం రమేష్



బైక్ ర్యాలీలో సీఎం రమేష్, పీలా గోవింద, బుద్ధ నాగజగదీష్ తదితరులు

కొత్తూరు, ఆగస్టు 14 : హర్ ఘర్ తిరంగా యాత్రలో భాగంగా బీజేపీ యువమోర్చ బుధవారం అనకాపల్లిలో నిర్వహించిన బైక్ ర్యాలీని ఎంపీ సీఎం రమేష్ ప్రారంభించారు. నెహ్రూచౌక్ కూడలి నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ సుంకరమెట్ట కూడలి వరకు ఉత్సాహంగా సాగింది. తొలుత డాక్టర్ అంబేడ్కర్, బుద్ధుని విగ్రహాలకు ఎంపీ సీఎం రమేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బుల్లెట్ నడుపుతూ బైకు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు కర్రి రామకృష్ణ, మారిశెట్టి భాస్కరరావు, కొణతాల అప్పలరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, యలమంచిలి టీడీపీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, నాయకులు కోట్ని బాలాజీ, మళ్ల సురేంద్ర, బీఎస్ఎంకే జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి



జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 14: అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్‌ను ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు కోరారు. ఈ మేరకు బుధవారం ఆమెను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు విద్యా సంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించాలని, అనకాపల్లిలో ఏపీయూడబ్ల్యూజే భవన నిర్మాణానికి స్థలం కేటాయించి నిధులు మంజూరు చేయాలని యూనియన్ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మద్దాల రాంబాబు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెంటకోట జోగినాయుడు, కోరాడ చంద్రరావు, జిల్లా సహాయ కార్యదర్శి యల్లపు రమణాజీ, అనకాపల్లి ప్రెస్‌క్లబ్ కార్యదర్శి చాగంటి అవతారం తదితరులు కోరారు.

'పింఛనర్ల సమస్యలు పరిష్కరించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు జగన్నాథరావు

కొత్తూరు, ఆగస్టు 14 : పింఛనర్ల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు వడ్డాది జగన్నాథరావు కోరారు. పట్టణంలోని నర్సింగరావుపేటలో గల ఏపీటీఎఫ్ భవనంలో బుధవారం ఏర్పాటైన సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. 11వ పీఆర్సీ బకాయిలు, డీఆర్ ఎరియర్స్ చెల్లించాలని, ఆరోగ్యకార్డుల ద్వారా నగదు రహిత వైద్యసేవల సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కార్యదర్శి బీఎల్ఎన్ శర్మ, మండల శాఖ అధ్యక్షుడు కె.రామారావు మాట్లాడుతూ అనకాపల్లిలో సంఘ భవనం నిర్మాణానికి ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు. జిల్లా ఖజానా అధికారిణి ఎల్.సుభాషిణి మాట్లాడుతూ పింఛనర్లకు సమస్యలు ఉంటే తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో ఉప ఖజానా (పడమర) అధికారి ఎం.బిజయకుమార్, రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.సోమేశ్వరరావు, ట్రెజరర్ కె.సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛత లేని బంగారంపై అప్రమత్తంగా ఉండాలి'



సదస్సులో మాట్లాడుతున్న వెంకటరమణ

అనకాపల్లి టౌన్, ఆగస్టు 14: శ్రావణమాసం ముసుగులో జిల్లాలో స్వచ్ఛత లేనిబంగారు ఆభరణాల అమ్మకాలు పలుచోట్ల జరుగుతున్నాయని కన్స్యూమర్ ఆర్గనైజేషన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ ఆరోపించారు. బుధవారం ఇక్కడ జరిగిన మహిళా సదస్సులో మాట్లాడారు. కొన్ని బంగారం దుకాణాలు ప్రకటించే రాయితీలు, లక్కీ డ్రా కూపన్లు వంటి ఆకర్షణీయమైన ప్రకటనల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ సదస్సులో గౌరీ గ్రంథాలయం మాజీ కార్యదర్శి మళ్ల బాపునాయుడు, ఉపాధ్యక్షులు కర్రి గంగాధర్, మళ్ల సూరిబాబు, దాడి ఈశ్వరరావు, రాపేటి ప్రేమలత, మళ్ల మౌనిక, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

వర్షాభావంతో ఎండిపోతున్న వరి ఆకుమడులు



దిబ్బిడిలో ఎండిపోతున్న వరి ఆకుమడికి నీరు అందిస్తున్న మహిళా రైతు

బుచ్చెయ్యపేట, ఆగస్టు 14: మండలంలో వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో వరి ఆకమడులు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. నారుమడులను రక్షించుకునే క్రమంలో రైతులు అనేక ప్రత్యామ్నాయ ఏర్పాట్లు అనురిస్తున్నారు. మండలంలో మూడు వరాలుగా వరుణుడి జాడ కనిపించడం లేదు. ఎర్రవాయి ప్రాంతంలో పది గ్రామాల్లోని ఆకుమడులు దెబ్బతింటున్నాయి. ఎండలు వేసవిని తలపిస్తుండటంతో ఎండిపోతున్న ఆకుమడులను రక్షించుకునేందుకు దూరంలో ఉన్న వ్యవసాయ బావులు, బోర్లు నుంచి ప్లాస్టిక్ బొద్దులు ద్వారా నీటి తడులు అందిస్తున్నారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



విద్యార్థిని అభినందిస్తున్న న్యాయమూర్తి

నర్సీపట్నం, ఆగస్టు 14: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు 'వ్యక్తులు, సమాజంపై మాదక ద్రవ్యాలు ప్రభావం' అంశంపైవ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పోటీలలో విజేతలను సీనియర్ సివిల్ జడ్జి షియాజ్‌ఖాన్ అభినందించారు. వక్తృత్వ పోటీలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న నరేష్ ప్రథమ స్థానం, బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విజయ్ ద్వితీయ స్థానం సాధించారు. వ్యాస రచన పోటీలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని జి జానకిబాల రాజేశ్వరి మొదటి స్థానం, శ్రీవిద్యా కళాశాల విద్యార్థిని ఎస్.ప్రేమవర్షిత ద్వితీయ స్థానం సాధించారు. విజేతలకు కోర్టు సముదాయంలో జరిగే సాతంత్ర్య దిన వేడుకల్లో న్యాయమూర్తి బహుమతులు అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాపాల్ ఎస్.రాజు, ఎంఈవో నాగేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.


నిండుకుండలా తాండవ



కళకళలాడుతున్న తాండవ

నాతవరం, ఆగస్టు 14: తాండవ రిజర్వాయర్ నిండుకుండలా దర్శనమిస్తూ కళకళలాడుతుండటంతో తాండవ ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తాండవ గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు కాగా, ప్రస్తుతం తాండవలో 376 అడుగుల నీటినిల్వలు ఉన్నాయి. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తాండవలోకి ఇన్‌ఫ్లో ద్వారా 400 క్యూసెక్కుల నీరు చేరుతోంది. అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో 52 వేల ఎకరాలకు సాగునీరు అందించే తాండవ రిజర్వాయర్ నీటిని ఆగస్టు 19న విడుదల చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వర్షాలు మరింత ఎక్కువైతే తాండవలో పూర్తి స్థాయిలో నీటి నిల్వలు చేరే అవకాశం ఉంది.

'ఒకే విత్తనం.. మూడు మొలకలు' పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరించిన కవులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 14 : ఇక్కడి శాఖా గ్రంథాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ కవి సమ్మేళనాన్ని బుధవారం నిర్వహించారు. అనకాపల్లి సాహితీమిత్రులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో లక్కోజు రాజా గణేష్ రచించిన 'ఒకే విత్తనం.. మూడు మొలకలు' కథా సంపుటి పుస్తకాన్ని డాక్టర్ చక్రపాణి ఆవిష్కరించారు. ఈ పుస్తకంలోని కథలను సమీక్షించారు. రచయిత రాజా గణేష్‌ను సత్కరించారు. జీఎస్‌కే సాయిబాబా కథల పుస్తకం, తాతమ్మ కథలు పుస్తకాన్ని మాదీసనారా, జీఎల్ఎన్ శాస్త్రి పుస్తక స్పర్శ కవితలను రంగబాబు పరిచయం చేశారు. సంస్థ కన్వీనర్ గొంతిన రంగబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కర్రి మల్లేశ్వరి, గంపా శ్రీదేవి, డీఎల్ నారాయణ, షేక్‌బాషా, జీఎల్ఎన్ శాస్త్రి, కోరాడ అప్పలరాజు, బల్లా నాగభూషణం, గ్రంథాలయాధికారి కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన దోసూరు ఎంపీటీసీ పద్మజ

అచ్యుతాపురం, ఆగస్టు 14: వైసీపీకి చెందిన దోసూరు గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు రాజాన పద్మజ, ఆమె భర్త అప్పారావు బుధవారం జనసేనలో చేరారు. అచ్యుతాపురంలో వీరికి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బైలపూడి శ్రీరామదాసు, లాలం చందు, ద్వారపురెడ్డి బాపూజీ, చిన్ని పంతులు, పవన్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

హైస్కూలుకు సిమెంట్ బెంచీల వితరణ



బుచ్చెయ్యపేట, ఆగస్టు 14 : వడ్డాది జడ్పీ హైస్కూల్‌కి స్థానిక పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దొండా సన్యాసిరావు, స్థానికులు గిడుతూరు ఈశ్వరరావు, అనుపూజుల వెంకటరావులు బుధవారం నాలుగు సిమెంట్ బెంచీలను వితరణగా అందజేశారు.











స్వయంభూ గణపతి ఉత్సవాలకు పందిరిరాట

చోడవరం, ఆగస్టు 14 : ఈ ఏడాది స్వయంభూ గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్టు స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి బుధవారం ఆలయం వద్ద ఉత్సవరాట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పేరొందిన స్వయంభూ విఘ్నేశ్వరుడి ఉత్సవాలు అందరి సహకారంతో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వచ్చే నెల 7 నుంచి 15 వరకూ ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు కొడమంచిలి చలపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఎస్వీ సత్యనారాయణ, మాజీ ఎంపీపీ పెదబాబు, అర్చకులు కొడమంచిలి శ్రీనివాస్, సంగీస విఘ్నేశ్, ఆలయ కమిటీ ప్రతినిధులు ఉప్పల సతీష్, చేకూరి రాజు, గనిరెడ్డి, పసుమర్తి మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.


పందిరిరాట కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజు

ఘనంగా హర్ ఘర్ తిరంగా

- భారీ జాతీయ జెండాల ఆవిష్కరణలు
- పతాకాల పంపిణీ, బైక్ ర్యాలీలు


దేవరాపల్లిలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక ఆధ్వర్యంలో భారీ జెండా ఊరేగింపు


కె.కోటపాడులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కూటమి నాయకులు


మాకవరపాలెంలో భారీ ఊరేగింపు

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు పలు చోట్ల బుధవారం 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. పలు పార్టీలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమాన్ని చేపట్టి భారీ జాతీయ జెండాలను ఆవిష్కరించారు. జెండాలను పంపిణీ చేశారు. అన్ని వర్గాల వారు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట, ఆగస్టు 14 : తురకలపూడిలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీలో ఎంపీడీవో తాడి వెంకటాచార్య పాల్గొన్నారు. మానవహారం నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. ఇళ్లపై ఆవిష్కరణ కోసం 700 జాతీయ జెండాలను పంపిణీ చేశారు. తల్లికి వందనం పథకంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ అప్పలనాయుడు, రవికుమార్, సర్పంచ్ గోవింద, గ్రామ పంచాయతీ కార్యదర్శి సీహెచ్ఆర్ఎం సత్యనారాయణ పాల్గొన్నారు. వడ్డాదిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీవీ రామరాజు ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు. బైక్ ర్యాలీలు నిర్వహించారు. తల్లికి వందనం పేరిట మొక్కలు నాటారు. బీజేపీ నాయకులు శిరిగిరిశెట్టి చినవెంకయ్యదొర, గొంతిన ఈశ్వరరావు, సాయం అయ్యన్నదొర, ఎస్.మణికంఠ, కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ : మండలంలోని కేఎల్‌బీ పట్నం గ్రామంలో కూటమి నేతలు, కార్యకర్తలు జెండాలతో ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో మాడుగుల నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ మేరపురెడ్డి శ్రీనివాసరావు, పార్టీ నియోజకవర్గ ప్రచార కమిటీ చైర్మన్ శివాజీరాజు, పరవాడ మురళీ, రొంగలి నర్సింగరావు, కిల్లి బాలాజీ, రొంగలి వినయ్‌కుమార్, బండారు భూమేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మంచాల మోడల్ స్కూల్ నుంచి 500 అడుగుల పొడవైన జాతీయ పతాకంతో విద్యార్థులతో ప్రిన్సిపాల్ చెరకాపు వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు ర్యాలీ చేపట్టారు.

దేవరాపల్లి : ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కళాశాల నుంచి రామాలయం వరకు 1500 అడుగుల జాతీయ జెండాను బుధవారం సాయంత్రం ఊరేగించారు. వేదిక జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ, సాయిలోహిత్, కె.శ్రీను, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం : మండలంలోని తూటిపాల గ్రామ వీధుల్లో బుధవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్కూలు హెచ్ఎం కోసూరు రాము, పంచాయతీ కార్యదర్శి బాబురావు, వైద్య ఆరోగ్య సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రోలుగుంట : మండలంలోని బుచ్చెంపేటలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక బీజేపీ నాయకులు జాతీయ జెండాను చేత పట్టుకుని గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

కె.కోటపాడు : బీజేపీ మండల అధ్యక్షుడు కొటాన ఈశ్వరరావు ఆధ్వర్యంలో కె.కోటపాడుతో కూటమి నాయకులు మూడు రోడ్ల జంక్షన్ నుంచి మొదలై పలు వీధుల్లో 'భారత్ మాతాకీ జై' అంటూ నినదిస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ సీనియర్ నాయకులు శరగడం సన్యాసినాయుడు, ఇమంది సన్యాసిరావు, బండారు సత్యనారాయణ పాత్రుడు, జనపరెడ్డి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేట : గొలుగొండ మండల బీజేపీ అధ్యక్షుడు చందక గౌరీ నాయుడు ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు జాతీయ జెండా చేత పట్టుకుని ఏఎల్‌పురం, పాత కృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లో బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో నేతలు అరిమెల రాజు, రేములు చంద్రరావు, సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దరిశి సత్యనారాయణ పాల్గొన్నారు.


బుచ్చెయ్యపేటంలో జెండాలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో

విద్యార్థులకు చదువే ముఖ్యం కావాలి

చోడవరం అడిషనల్ సివిల్ జడ్జి డా.సూర్యకళ


విద్యార్థులతో మాట్లాడుతున్న జస్టిస్ సూర్యకళ

చీడికాడ, ఆగస్టు 14 : ప్రతి విద్యార్థి తన దృష్టిని చదువుపైనే సారించాలని చోడవరం అడిషనల్ సివిల్ జడ్జి డాక్టర్ బి.సూర్యకళ పేర్కొన్నారు. జి.కొత్తపల్లి సమీపంలోని కేజీబీవీ పాఠశాల, వసతి గృహాన్ని బుధవారం సాయంత్రం సందర్శించారు. విద్యార్థుల కోసం రాత్రికి వండిన వంటకాలను పరిశీలించారు. బుధవారం ఉదయం వండిన వంటకాల గురించి ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా విద్యాభ్యాసానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు. విద్యతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత, ఆహార నియమాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో హిందీ టీచర్ పరమేశ్వరి, పీఈటీ చిన్నమ్మలు, ఏఎస్ఐ నాగేశ్వరరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలకు రోడ్డు వేయాలి

- ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం



నినాదాలు చేస్తున్న సంఘ ప్రతినిధులు, గిరిజనులు

మాడుగుల, ఆగస్టు 14 : మారుమూల గిరిజన గ్రామాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ఆ గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం నాన్-షెడ్యూల్ ఏరియా జిల్లా కార్యదర్శి ఇరట నర్సింహమూర్తి డిమాండ్ చేశారు. బుధవారం మాడుగుల మండలంలో శంకరం పంచాయతీ కృష్ణంపాలెం నుంచి చుట్టుగెడ్డ గిరిజన గ్రామాలను సంఘం నేతలు సందర్శించారు. అనంతరం నర్సింహమూర్తి మాట్లాడుతూ శంకరం పంచాయతీ శివారు చుట్టుగెడ్డ గిరిజన గ్రామానికి కనీసం రోడ్డు సౌకర్యం లేదన్నారు. కనీసం పాదచారులు కూడా నడవలేని దుస్థితిలో చిన్నదారి ఉందన్నారు. ఇలాంటి స్థితిలో మరికొన్ని గ్రామాలు కూడా ఉన్నాయని, వీటి అన్నింటికీ రహదారి సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు జనపరెడ్డి కొండలరావు, నెల్లూరి కృష్ణ, చిన్నారావు, బాలరామ్మ తదితరులు పాల్గొన్నారు.

'పొలంబడి'లో రైతులకు సూచనలు

మాడుగుల, ఆగస్టు 14 : వరినాట్లు వేసే వ్యవసాయ రైతులు ముందుగా వరి నారు వేరు శుద్ధి చేసి, నారు చిగుళ్లను తుంచి వరుస క్రమంలో నాటితే అధిక దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారి ఎం.వాసుదేవరావు తెలిపారు. బుధవారం మండలంలోని ముకుందపురంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించి పొలాల్లో వ్యవసాయ కూలీలతో కలిసి నాట్లు వేశారు. వరినాట్లు వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులతో పాటు సిబ్బంది ఎ.మంగరాజు, శ్రావణి, జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

రావికమతం : మండలంలోని గుడివాడలో పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. కొండెంపూడి కేవీకే శాస్త్రవేత్తలు ఎన్.సత్తిబాబు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొని రైతులకు పురుగు మందులపై ఉండే విషపూరిత లేబుల్స్ రంగుల గురించి వివరించారు. రైతుల పొలాల్లో పక్షి స్థావరాలను ఏర్పాటు చేయించారు. ఎరువుల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



రైతులకు సూచనలు అందిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

సంక్షిప్తంగా..

కంప్యూటర్స్, టైలరింగ్‌లో యువతకు శిక్షణ

చోడవరం, ఆగస్టు 14 : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ స్కిల్ హబ్‌లో కంప్యూటర్, టైలరింగ్ కోర్సులలో శిక్షణ ప్రారంభిస్తున్నట్టు కాలేజీ ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్, స్కిల్ సెంటర్ కో-ఆర్డినేటర్ అప్పలనాయుడు తెలిపారు. మూడు నెలల ఈ ఉచిత శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తామని చెప్పారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆధార్, ఇతరధ్రువపత్రాలతో రావాలన్నారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ : 94947 91935లో సంప్రదించాలని కోరారు.

దివ్యాంగ సంక్షేమ సంఘం సమావేశం రేపు


చోడవరం, ఆగస్టు 14 : దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక వికలాంగుల, ఆదివాసీ రైతు ఉత్పత్తుల సంఘ భవనంలో ఈ నెల 16 సమావేశం నిర్వహిస్తున్నట్టు సంఘంఅధ్యక్షుడు శరగడం భూషణం, గౌరవ అధ్యక్షులు దుగ్గిరాల రవికుమార్ తెలిపారు. ఈ సమావేశంలో చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు, రుణాల సౌకర్యం శిక్షణకు సంబంధించి మినిస్ట్రీ ఆఫ్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ సంస్థ జాయింట్ డైరెక్టర్ ఎ.శ్రీనివాస్ సభ్యులకు అవగాహన కల్పిస్తారన్నారు. ఈ సమావేశానికి దివ్యాంగ సభ్యులంతా తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

నైట్ వాచ్‌మన్‌పై చర్యలు తీసుకోవాలి

గొలుగొండ, ఆగస్టు 14 : విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న చీడిగుమ్మల హైస్కూల్ నైట్ వాచ్‌మన్‌ను తొలగించాలని గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు బుధవారం ఇన్‌చార్జి ఎంఈవో సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. చీడిగుమ్మల హైస్కూల్లో ఆరు నెలలుగా నైట్ వాచ్‌మన్ రాత్రి సమయాల్లో విధులు నిర్వహించడం లేదన్నారు. స్థానిక హెచ్‌ఎంకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని, దీనిపై విచారణజరిపి నైట్‌వాచ్‌మన్‌ను తొలగించాలని కోరారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేస్తామని గ్రామస్థులు తెలిపారు.

15 అడుగుల భారీ కొండచిలువ హల్‌చల్

మాడుగుల, ఆగస్టు 17 : మండల కేంద్రం మాడుగులలో భారీ కొండచిలువ హల్‌చల్ చేసింది. స్థానిక మోదమాంబ కాలనీలో 15 అడుగుల భారీ కొండచిలువ కనిపించడంతో కాలనీ ప్రజలు బెంబేలెత్తిపోయారు. స్థానికంగా ఉన్న స్నేక్ క్యాచర్ పెచ్చేటి వెంకటేష్‌కే సమాచారం అందించడంతో అతను వచ్చి పామును బంధించి సమీప అటవీప్రాంతంలో విడిచిపెట్టారు.






సైన్స్ ప్రాక్టికల్స్ పరికరాలు, రసాయనాలు వితరణ


నర్సీపట్నం, ఆగస్టు 14 : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తురక బడి)లో సైన్స్ ప్రాక్టికల్స్‌కు ఉపయోగించే పరికరాలు, రసాయనాలను బుధవారం స్థానిక ఏబీఎం కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ అందజేశారు. ముంబైలో స్థిరపడిన నర్సీపట్నం ప్రాంతానికి చెందిన వీఎస్ఎస్ఎన్ మూర్తి ఫ్యాన్ అందజేశారని ఇన్‌చార్జ్ హెచ్ఎం దైవప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయుడు ఐ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేట భారీ వర్షం

కృష్ణాదేవిపేట, ఆగస్టు 14 : ఏఎల్‌పురం, చోద్యం, లింగంపేట, నాగాపురం, కొంగసింగి, పాతకృష్ణాదేవిపేట, విప్పలపాలెం తదితర గ్రామాల్లో బుధవారంసాయంత్రం భారీ వర్షం పడింది.







డ్రగ్స్ రహిత సమాజమే అందరి లక్ష్యం కావాలి

వడ్డాది కళాశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ

బుచ్చెయ్యపేట, ఆగస్టు 14 : డ్రగ్స్ రహిత సమాజమే అందరి లక్ష్యం కావాలని వడ్డాది జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వైవీఎల్ అన్నపూర్ణ అన్నారు. ఆమె బుధవారం నషా ముక్త్ భారత్, అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా సామూహికంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత అన్నారు. దేశ ప్రగతిని ముందుకు తీసుకువెళ్లాల్సిన యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల మానసిక స్థితి కోల్పోయి నేరాలు చేసే అవకాశం ఉంటుందన్నారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా చేపట్టిన అవగాహనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నపూర్ణ కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఇ.నర్సింహమూర్తి, జేఎస్ ప్రభ, బి.నారిబాబు, సుధీరు శ్రీనువాసు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న వడ్డాది జూనియర్ కళాశాల విద్యార్థులు

అంతర్ జిల్లా సాఫ్ట్‌బాల్ పోటీలో డిగ్రీ విద్యార్థి ప్రతిభ

నర్సీపట్నం, ఆగస్టు 14 : పల్నాడు జిల్లాలో ఈ నెల 10 నుంచి 12 తేదీ వరకు జరిగిన అంతర్ జిల్లా సాఫ్ట్ బాల్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ తృతీయ సంవత్సరం చదువుతున్న రావుల సోమేశ్వరరావు మంచి ప్రతిభ కనబరిచాడని ప్రిన్సిపాల్ రాజు తెలిపారు.గత నెలలో సోమేశ్వరరావు జిల్లా సాఫ్ట్‌బాల్ జట్టుకి ఎంపికయ్యాడని తెలిపారు. అంతర్ జిల్లా పోటీలలో రాణించడం అభినందనీయమని అన్నారు.

హిందువులపై దాడులను నిరసిస్తూ కాగడాల ర్యాలీ

చోడవరం, ఆగస్టు 14 : బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లతో పాటు ఇతర దేశాల్లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ మండలంలోని వెంకన్నపాలెంలో హిందూ ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ దాడులను ఆపే విధంగా ప్రపంచదేశాలతో పాట, దేశ పాలకులు చొరవ చూపాలని వెంకన్నపాలెం అన్నపూర్ణ ఆశ్రమం నిర్వాహకులు రేజేటి నరసింహాచార్యులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కూర్మదాసు మాలిబాబు, అప్పలస్వామి, ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు

